క్లుప్తంగా

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ

మండవల్లి: లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ కె.సునీత ఫిజియోథెరపీ చేశారు. హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు, సాయి, వేణు మాస్టర్ పిల్లల బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఐఈఆర్టీలు టి.అరుణకుమారి, వై.శిరీష, జి.శైలజ భవిత కేంద్రంలో సేవలు అందజేశారు.

మువ్వన్నెల జెండాకు వందనం

గుడ్లవల్లేరు: భారత దేశ సర్వమత సౌభ్రాతృత్వం వర్ధిల్లే విధంగా మువ్వన్నెల జెండాలో ఒదిగి ఉందని స్థానిక శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల అధినేత శింగంశెట్టి ఆదినారాయణ అన్నారు. మంగళవారం ఆయన జాతీయ జెండాను విద్యార్థులతో కలిసి ఎగురవేసి జెండా వందనం చేశారు. జాతీయ జెండాను ఆగస్టు 15వ తేదీన ఎగుర వేసేందుకు తీర్మానించిన చరిత్ర కలిగిన ఇదే రోజు అని కూడా విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక శిక్షణ



గుడివాడ టౌన్: 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ జి. జగన్మోహనరావు అన్నారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో మంగళవారం అప్ కమింగ్ షైనింగ్ స్టార్స్ మిషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా గుడివాడ, మండలంలోని పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రతి పాఠశాల నుండి టాప్-5 విద్యార్థులను ఎంపిక చేసి ఈ శిక్షణ ఇచ్చినట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బి. బాలాజీ, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ ఎం. శ్రీనివాసరావు, డి. చంద్రశేఖర్, పి. వేణుగోపాల్, పి. ప్రకాష్‌బాబు, బివి. రమాదేవి, మీరా హుస్సేన్, పి. సునీత పాల్గొన్నారు.

దత్తాశ్రమంలో కృష్ణచంద్‌కు సత్కారం

మండవల్లి: ఒకే సారి 18 మందికి యాంజియోగ్రామ్‌లు చేసి, వారిలో అవసరమైన తొమ్మిది మందికి ఆపరేషన్ చేసి ప్రాణాలను కాపాడిన ఘనత ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కాగిత కృష్ణచంద్ అని వక్తలు అన్నారు. అలాంటి వ్యక్తికి సత్కారం చేయడం మన అదృష్టమని కైకలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, దత్తాశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్ శంకర్ ప్రశంసించారు. మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో అబ్దుల్ కలాం అవార్డు గ్రహీత, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కాగిత కృష్ణ చంద్‌కి మంగళవారం చిరు సత్కారం చేశారు. రుద్రపాక రత్నారావు, బండి తులసిరావు, వేంద్ర నాగరాజు, బి.శ్యామలరాజ్ గౌడ్, బి.సత్యనారాయణ, బి.వెంకట్రావు, సీహెచ్ కనకదుర్గ, శ్రీను, సింహాద్రి పాల్గొన్నారు.

25 నుంచి శ్రావణ మాసోత్సవాలు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ దేవస్థానంలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవములు నిర్వహించనున్నారు. అర్చకులు శివ సంతోష్ శర్మ, అసాదు టి.వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 7.30గంటల వరకు సహస్రనామ కుంకుమార్చనలు, ప్రతి శుక్రవారం ఉదయం పంచామృత అభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చనలు సాయంత్రం పంచహారతులు నిర్వహించనున్నారు. వచ్చే నెల 15వ తేదీన ఉదయం 9గంటలకు మహిళలచే సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు.

శాకంబరీదేవిగా అమ్మవారు

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల గ్రామంలోని శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారు మంగళవారం శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. పలు రకాల కూరగాయాలతో అమ్మవారికి అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు చిదంబరం స్వామి పూజలు చేశారు.

అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి విచ్చేసే భక్తుల నుంచి విశ్రాంతి గదుల అద్దెలు, టెంట్ సామాన్లకు అధిక డబ్బులు వసూలుపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ వి.రవికుమార్ హెచ్చరించారు. దేవస్థానం వద్ద వ్యాపారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గుడికి వచ్చిన భక్తులకు గదులు అద్దెకు ఇచ్చే సమయంలో ఆధార్ కార్డులు తీసుకోవాలన్నారు. గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. రూరల్ ఎస్సై రాంబాబు పాల్గొన్నారు.



అధ్వానంగా మారిన ఇలపర్రు రోడ్డు



లక్ష్మీనరసింహపురం రోడ్డు దుస్థితి

గుంతలమయంగా రోడ్లు

పట్టించుకోని పాలకులు, అధికారులు

నందివాడ: మండలంలోని పలు రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి. పలుచోట్ల గుంతలు ఎంత లోతు ఉన్నాయో తెలియక వాటిలో పడి ద్విచక్రవాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. రాత్రిళ్లు అయితే ప్రయాణం నరకంగా మారుతుందని వాహనచోదకులు వాపోతున్నారు.

కూటమి నాయకుల హామీలు నీటి మూటలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లను అభివృద్ధి చేస్తామని నాయకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా రోడ్ల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడ మాదిరిగానే ఉంది. ఏ రోడ్డు చూసిన గుంతలతో పాటు రాళ్లు లేచి దర్శనమిస్తున్నాయి. ఎన్నికల సమయంలో హామీల పేరిట నానా హంగామా చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించారననే విమర్శలు ఉన్నాయి.

ప్రమాదాలకు నిలయంగా రోడ్డు

లక్ష్మీనరసింహపురం నుంచి కుదరవల్లి వెళ్లే రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. అడుగేస్తే గొయ్యి అడుగు తీస్తే గొయ్యి మాదిరిగా ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. ఎక్కడ చూసినా పెద్ద గుంతలతో రోడ్డు దారుణంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు తంటాలు పడుతున్నారు. ఈ రోడ్డు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుకు కొన్నిచోట్ల తాత్కాలిక మరమ్మతులు తూతూ మంత్రంగా చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

నరకప్రాయంగా ప్రయాణం

పెదవిరివాడ నుంచి గొంగళ్లమూడి వెళ్లే రహదారి పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ఈ రోడ్డు సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. కనీసం మరమ్మతులైనా చేపట్టాలని కోరినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. సంక్షేమ పథకాలు కూడా ఇవ్వని ప్రభుత్వం రోడ్లను అయినా అభివృద్ధి చేస్తుందని ఆశపడితే అది చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా మారిన పెదవిరివాడ రోడ్డు

ఈ రోడ్డుపై ప్రయాణం సాగేదెలా!





అధ్వానంగా మారిన మొవ్వ-కూచిపూడి రోడ్డు

మొవ్వ: మొవ్వ నుంచి ప్రముఖ నాట్య క్షేత్రం కూచిపూడికి మధ్య గల రహదారి పై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు పై ఏర్పడి గుంతలతో పగలు ప్రయాణమే గండంగా మారింది. ఇక రాత్రి అయితే ఈ రోడ్డు పై వెళ్లాలంటే కత్తి మీద సాములా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పై అడుగడుగునా పెద్ద గుంతలు ఏర్పడి వర్షాకాలంలో చెరువులను తలపిస్తున్నాయి. ఈ రోడ్డు కూచిపూడి నుంచి అయ్యంకి వరకు కూడా ఇదే పరిస్థితి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు ఈ రోడ్డుపై దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పెదపూడి(మొవ్వ): మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని, డైవర్షన్ రాజకీయంలో ప్రజల దృష్టి మళ్లించడంలో ఆయన దిట్ట అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మొవ్వ మండలం పెదపూడిలోని వైఎస్సార్ సీపీ నాయకుడు తాతా రాంబాబు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన 'బాబూ ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'పై మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షులు రాజులపాటి రాఘవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. ఇంటింటికీ తిరిగి అనేక హామీలతో బాండు పేపర్లు ఇచ్చి మరీ మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం గడిచిన 13 నెలల్లో సాగించిన రెడ్ బుక్ పాలనను, డైవర్షన్ రాజకీయాలను, వైఎస్సార్ సీపీపై, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై చేసే దుష్ప్రచారాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

అక్రమార్జనే ధ్యేయంగా పాలన

అక్రమార్జనే ప్రధాన ధ్యేయం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాలన సాగిస్తున్నాడని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఇసుక మాఫియాతో మొదలుకుని ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగ్‌లలో అందిన కాడికి దోచుకుంటున్నాడన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

కార్యకర్తలకు, పార్టీ నాయకులకు నిత్యం అందుబాటులో ఉంటానని, ఏమైనా తన వైపు నుంచి సమస్యలు ఉన్నట్లయితే సరిచేసుకుంటానని కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కూటమి నాయకులు తాటాకు చప్పుళ్లకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత తనతో పాటు నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యారా సాయి ప్రశాంత్, గ్రామ సర్పంచ్ తాతా రజిని, మాజీ ఎంపీపీ పులి లక్ష్మి, సర్పంచ్‌లు నాగనబోయిన సునీల్, పంది కృష్ణ, కే అన్నామణి, తాతా స్వప్న, పెనుమూడి రమేష్, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు అప్పికట్ల ఇమ్మానియేలు, ఎంపీటీసీ సభ్యుడు సమ్మెట ఆంజనేయులు, నాయకులు మంద శ్రీనివాసరెడ్డి, కొండవీటి అమరబాలేశ్వరరావుతో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చినముత్తేవి గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని బండారు మేఘనాథ్ (జాషువా) మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సమక్షంలో వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నాడు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న పాలన నచ్చక వైఎస్సార్ సీపీలో చేరినట్లు మేఘనాథ్ తెలిపాడు.

డ్రెయినేజీ అధికారి నిలదీత

ఈదులమద్దాలిలో రైతుల ఆందోళన



ఈదులమద్దాలి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఈదులమద్దాలి(పెదపారుపూడి): వరి పైరు వర్షం నీటితో మునిగిపోవటంతో ఈదులమద్దాలి పొలాల వద్ద మంగళవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ చంద్రయ్య డ్రెయిన్ గుడివాడ ఆక్రమణకు గురికావటం, పాలకొండ వద్ద లాకులు ఎత్తకపోవటంతో పొలాలు నీట మునిగి వరిపైరు దెబ్బతిన్నా డ్రెయినేజీ అధికారులు స్పందించటం లేదని కౌలు రైతు గంటా కమలాకారరావు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది వరదలకు పంట దెబ్బతింది. రెండు రోజుల క్రితం కురిసిన చిన్న పాటి వర్షాలకు డ్రెయిన్ పొంగి పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. రైతులు వద్దకు వచ్చిన డ్రెయినేజీ ఏఈ అనిల్‌కు ప్రతి సంవత్సరం చిన్నపాటి వర్షాలకే పంట దెబ్బతింటుటే రైతులు వ్యవసాయం ఎలా చేయాలని నిలదీశారు. గుర్రపుడెక్క తొలగించకపోవటంతో వరద నీరు పంట పొలాలను ముంచేసిందన్నారు. ఎకరానికి రూ.10వేలు ఖర్చు చేసి నాట్లు వేస్తే ఎందుకు పనికి రాకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అచ్యుతానందన్‌కు ఘన నివాళులు



అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: నిబద్ధత, మంచి పరిపాలనకు నిదర్శనం వీఎస్. అచ్యుతానందన్ అని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ సంస్మరణ సభ జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతీయ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగా కేరళ ముఖ్యమంత్రిగా 2006 నుంచి 2011 వరకు ప్రజలకు సేవలందించారన్నారు. సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, ఎస్. మురళీ కృష్ణారెడ్డి, ఎల్. సురేంద్ర, పి. రజిని, సీహెచ్ శివ, ఆర్. కొండ, ఎ. వెంకట్రావు, నారాయణరావు, విజయ్‌కుమార్, త్రిమూర్తులు, శ్రీనివాసరావు, ఎ. వెంకటేశ్వరరావు, వి. కృష్ణకిషోర్, ఎల్. రాధాకృష్ణ పాల్గొన్నారు.

చేపల చెరువులను తలపిస్తున్న వరి పొలాలు



మోపర్రులో దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతులు

మోపర్రు(పెదపారుపూడి): ఎగువ నుంచి వస్తున్న వరద నీరు, ముస్తాదాబాద్ డ్రెయిన్ పూడిక తీత పనులు చేయకపోవటంతో సుమారు 200 ఎకరాల పంట పూర్తిగా నీట మునిగి దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి పొలాలు చేపల చెరువులను తలపిస్తున్నాయని తెలిపారు. మంగళవారం మోపర్రు గ్రామానికి చెందిన రైతులు, సర్పంచ్ జాపల్లి శేఖర్ మాట్లాడుతూ గత ఏడాది వరదాల కారణంగా వరి పూర్తిగా దెబ్బతిని గింజ కూడా ఇంటికి తీసుకుని వెళ్లలేదన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సుమారు 200 ఎకరాల వరి నాట్లు పూర్తిగా నీట మునిగి పోయాయని పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

గత జూన్‌లోనే ముస్తాదాబాద్ డ్రెయిన్ పూర్తిగా తూడు, గుర్రపుడెక్కతో నిండి పోయిందని, డ్రెయినేజీ అధికారులకు చెప్పిన పట్టించుకోలేదన్నారు. దీంతోనే ఇప్పుడు కూడా పంట పొలాలు మునిగిపోయాయన్నారు. దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు.

విజయవాడకు తరలివెళ్లిన లారీ యజమానులు

గుడివాడ టౌన్: గుడివాడ ట్రాన్స్‌పోర్టు వాహనాల జేఏసీ నాయకులు విజయవాడకు మంగళవారం తరలివెళ్లారు. ఏటీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ కొన్ని రోజులుగా పట్టణంలో లారీల యజమానులు ఆందోళన చేస్తున్నారు. దీనిపై విజయవాడలోని ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు విజ్ఞప్తి చేసి ఏటీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తామని నాయకులన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎ. శ్రీనివాస్, గుత్తా చంటి, గోళ్ల శివ, ఆర్. ప్రసాద్, ఎ. రఘు, ఎ. నాని, పెదబాబు, దుర్గారావు, గోపాలరావు, ఎం. రాము, వై. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజీఆర్ఎఫ్‌తో విద్యుత్ ఫిర్యాదుల సత్వర పరిష్కారం

చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్



వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి, మెరుగైన సేవలు అందించటం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు విశ్రాంత జిల్లా జడ్జి, ఏపీసీపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని రాయల హంపి కల్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ గుణదలలోని సీజీఆర్ఎఫ్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్ ద్వారా కానీ విద్యుత్ వినియోగదారులు తమ అర్జీలను నేరుగా సమర్పించవచ్చని తెలిపారు. గత ఏడాది కాలంలో 200కు పైగా విద్యుత్ సమస్యలను సీజీఆర్ఎఫ్ పరిష్కరించినట్లు చెప్పారు. సదస్సులో మొత్తం 14 అర్జీలను స్వీకరించగా, పలువురు స్మార్ట్ మీటర్లపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గుడివాడ ఆటో నగర్ కార్మికులు, బాపులపాడు, ఉంగుటూరు సీపీఎం నాయకులు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దంటూ వినతిపత్రాలను సమర్పించారు. దీనిపై సీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానంద్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల అధిక బిల్లు లేదా విద్యుత్ రీడింగ్ నమోదు అవుతున్నట్లుగా అపోహలు ఉంటే, వారికి ప్రస్తుతం ఉన్న మీటర్లను కూడా తనిఖీ కోసం కొనసాగిస్తామని వివరించారు. సీజీఆర్ఎఫ్ సాంకేతిక సభ్యుడు ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యుడు ఆర్సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, గుడివాడ ఈఈ బీవీ శ్రీనివాసరావు, హనుమాన్ జంక్షన్ డీఈఈ బి.శ్రీనివాసరావు, పలువురు ఏఈలు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ఘనంగా తాజుద్దీన్ చందనోత్సవం



గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిర ఆవరణలోని తాజుద్దీన్ బాబా మందిరంలో బాబా వారికి చందోనోత్సవాన్ని మంగళవారం ఆ మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీకుమారి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత వేద పండితులు జ్ఞానసాయికి విశేషాభిషేకాలను చేపట్టారు. అనంతరం భక్తులందరికీ అన్న సమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయ ప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా పాల్గొన్నారు.

మొవ్వ సబ్ రిజిస్ట్రార్‌గా దుర్గారాణి



మొవ్వ: మొవ్వ సబ్ రిజిస్ట్రార్‌గా కే దుర్గారాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నందిగామ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఈమె డెప్యూటేషన్‌పై మొవ్వకు విచ్చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ల ఆరోపణల పై ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇక్కడ ఉన్న సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ సస్పెండ్ అయ్యారు. అప్పటి నుంచి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గణేష్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు.

ప్రభుత్వ భవనాల్లో శానిటేషన్‌పై ఆరా



శానిటేషన్‌పై సర్వే చేస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మంగళవారం గ్రామంలోని స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయం, గ్రామ పంచాయతీ, పీహెచ్‌సీ తదితర ప్రభుత్వ భవనాల్లో శానిటేషన్ నిర్వహణ ఎలా జరుగుతుంది అనే విషయమై సెంట్రల్ టీం సభ్యులైన రవి వర్మ టీం ఆరా తీశారు. గ్రామంలో సర్వే నిర్వహించారు. గ్రామస్తుల నుంచి మరుగుదొడ్ల నిర్వహణ, చెత్త సేకరణ వగైరాలు జరుగుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్, డెప్యూటీ ఎంపీడీఓ ఏజెఎల్ నరసింహారావు, గ్రామ కార్యదర్శి జయలక్ష్మి పాల్గొన్నారు.

ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా శిరోమణి



సర్టిఫికెట్ అందుకుంటున్న శిరోమణి

గుడివాడ టౌన్: గుడివాడకు చెందిన వెయిట్ లిఫ్టర్ వల్లమూడి శిరోమణి ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా పట్టా పొందారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 139 బంగారు పతకాలు, 149 ఇతర పతకాలు సాధించిన ఆమె సికింద్రాబాద్‌లోని మినర్వాగ్రాండ్ హోటల్లో వ్యక్తిగత వికాస తరగతులకు సంబంధించి పర్సనాలిటీ, డెవలప్‌మెంట్, వర్క్‌లైఫ్ బ్యాలెన్స్, టెక్నాలజి కంటెంట్ క్రియేషన్ తదితర అంశాలలో నెలరోజుల శిక్షణ అనంతరం జాతీయ స్థాయి ట్రైనర్ సర్టిఫికెట్ పొందారు. ఈనెల 20వ తేదీన జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు సర్టిఫికెట్ బహూకరించారు. నేషనల్ బిజినెస్ హెడ్ బి.సుధీర్, రీజినల్ ప్రెసిడెంట్ దాసరి త్రినాథ్ ఈ సర్టిఫికెట్ అందజేశారు.

కొండంగి లాకుల నుంచి నీరు విడుదల

కలిదిండి(కైకలూరు): ఆక్వా రైతులు కొండంగి లాకుల నుంచి విడుదల చేసిన నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. కొండంగి లాకుల నుంచి లిఫ్టు నీటిని బటన్ నొక్కి మంగళవారం విడుదల చేశారు. మచిలీపట్టణం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్ మట్టా ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



వరిపొలాలను పరిశీలిస్తున్న డీఆర్సీ టీం, అధికారులు

పమిడిముక్కల: మోతాదుకు మించి భాస్వరం ఎరువుల వినియోగం వలన జింకు ధాతు లోపం ఏర్పడుతుందని డీఆర్సీ డీడీఏ జ్యోతిర్మయి పేర్కొన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డీఆర్సీ టీం, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు రైతులతో కలిసి పొలాలను సందర్శించి సూచనలు, సలహాలు అందజేశారు. వరి సాగులో రైతులు పాటించాల్సిన ఎరువుల యాజమాన్య పద్ధతులను జ్యోతిర్మయి వివరించారు. మొదటి దఫా ఎరువుల వినియోగంలో పొటాష్ కలిపి వేయుట వలన వరిపంటకు చీడపీడలను తట్టుకొనే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఏఓ గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.